సైబర్ నేరాలపై అవగాహన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్ తదితరులు

వణికిస్తున్న చలి...



- వీస్తున్న శీతల గాలులు
- జిల్లాలో 15 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఫ్లూ, జ్వరాలతో ప్రజలు సతమతం

జిల్లా ప్రజలను చలి వణికిస్తోంది. రోజంతా శీతల గాలులు వీస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోయాయి. చలి, శీతల గాలులతో ప్రజలు ఫ్లూ, జ్వరాలతో సతమతం అవుతున్నారు. చలికాలంలో జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో మొన్నటి వరకు ఆలస్యం అయ్యిందనుకున్న శీతాకాలం ఎట్టకేలకు వచ్చేసింది. వచ్చీరాగానే శీతల గాలులు వీస్తున్నాయి. సాయంత్రం కూడా కాకముందే వాతావరణం చల్లగా మారిపోతోంది. రాత్రి గడిచేకొద్దీ మరింత చల్లగా మారి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ సమయంలో బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వెచ్చదనం కోసం తపించిపోతున్నారు. జిల్లాలో చలిపులి భయ పెడుతోంది. మొన్నటి వరకు కార్తీకమాసం ప్రారంభమైనా ఇంకా చలి ప్రారంభం కాలేదని అందరూ అనుకున్నారు. ప్రస్తుతం చలితో పాటు శీతల గాలులు వీస్తున్నాయి. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. కర్నూలు, కోడుమూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, నంద్యాల, ఆత్మకూరు, బనగానపల్లె ఇలా అన్ని చోట్లా శీతల గాలులు వీస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోయాయి. వ్యవసాయభూములుండే గ్రామీణ ప్రాంతాల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో చలి కారణంగా ప్రజలు జలుబు, దగ్గు, బారిన పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది శ్వాసనాళాలు మూసుకుపోయి ఉపిరాడక ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అదే సమయంలో ఒక రకమైన ఇన్ఫ్లుయెంజా వైరస్ కూడా ఈ సీజన్లో వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

ఆసుపత్రులకు పెరిగిన రోగులు

వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో అసుపత్రులకు రోగులకు సంఖ్య పెరుగుతోంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఊపిరితిత్తుల విభాగానికి గతంలో ప్రతి బుధ, శని వారాల్లో ఓపీ ఉండేది. ప్రస్తుతం ప్రతి రోజూ 50 మందికి పైగా రోగులు వస్తుండగా, గత మూడు రోజులు నుంచి రోగుల సంఖ్య 80 దాటుతోంది. అలాగే ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో జనరల్ ఫిజీషియన్లు, కార్డియాలజిస్టులు, పల్మనాలజిస్టుల వద్ద కూడా రోగుల సంఖ్య 30 శాతం పెరిగినట్లు వైద్యులు చెబుతున్నారు.

దీర్ఘకాలిక రోగులూ జాగ్రత్త

శీతాకాలంలో శీతల గాలులు విస్తున్న వేళ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మధుమేహం, బీపీ, చైరాబర్, ఆస్తమా, సిఓపిడితో బాధపడేవారు దగ్గు, జలుబు, ఆయాస వస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యులను కలిసి వారి పరిస్థితిని వివరించి చికిత్స తీసుకోవాలని అంటున్నారు. వీరు చలి కాలంలో ఉదయం వేళ మంచుకురుసే సమయంలో వాకింగ్, జాగింగ్‌కు వెళ్లకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

- విజిబుల్ పోలీసింగ్‌తోనే నేర నివారణ సాధ్యం
- జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఆస్తి, సైబర్ నేరాల కేసులలో బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ జి.బింధు మాధవ్ పేర్కొన్నారు. గురువారం కర్నూలు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో ఎస్పీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్‌పి కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసులపై సమీక్షించి ఆరా తీశారు. పోలీసుస్టేషన్ల వారీగా కేసుల పెండింగ్‌కు గల కారణాలను, 2022, 2023, 2024 వారీగా పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ ఇయర్ ఎండింగ్‌లో ప్రాపర్టీ కేసులలో రికవరీ శాతం పెంచాలన్నారు. యుఐ కేసులు తగ్గించా లన్నారు. ఎవరినైనా అరెస్టు చేసే ముందు అరెస్టుకు సంబంధించిన విషయాలను తెలియ జేయాలన్నారు. ఫోక్సో, పెండింగ్ ట్రయల్ కేసులలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో మాట్లాడి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో కాంపౌండబుల్ కేసులు తగ్గించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలలో బాధితులకు తగిన నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ-చలాన్‌లు రికవరీ చేయాలన్నారు. సైబర్ చీటింగ్ కేసుల్లో బాధితులు మోసపోయిన నష్టాన్ని బ్యాంకులలో ఫ్రీజ్ చేయించిన ఆ మొత్తాన్ని కోర్టు అనుమతితో బాధితులకు అందజేయాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930కి వెంటనే ఫిర్యాదు చేసే విధంగా ప్రజలకు అవగాహన చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రాపర్టీ కేసులలో, వార్షిక ఫైరింగ్ సాధనలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం సైబర్ నేరాలకు సంబంధించిన అవగాహన కరపత్రాలను ఎస్పీ ఆవిష్కరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పి కృష్ణమోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డిఎస్పీలు జె.బాబు ప్రసాద్, సోమన్న, వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, ట్రైనీ డిఎస్పీ ఉష, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే ప్రప్రథమంగా వర్చువల్ క్లాస్

- ట్రయల్ రన్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలోనే ప్రప్రథమంగా కర్నూలు జిల్లాలో వర్చువల్ క్లాస్ రూం ద్వారా పదవ తరగతి విద్యార్థులకు బోధనా తరగతులు ప్రారంభం కానున్నాయి. గురువారం జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్చువల్ క్లాస్ రూం ట్రయల్ రన్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా డిఇఒ ఎస్.శామ్యూల్ పాల్ వర్చువల్ క్లాస్ రూమ్ ఏర్పాట్లపై కలెక్టర్‌కు వివరించారు అబ్దుల్ కలాం పాఠశాల, ఇందిరా గాంధీ మెమోరియల్ పాఠశాలల విద్యార్థులతో కలెక్టర్ సంభాషించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు వర్చువల్ విధానం ద్వారా మెరుగైన విద్య అందించబోతున్నామన్నారు. అధునాతన సాంకేతిక పరికరాలతో ఒక స్టూడియోను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలోని 352 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బోధన అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 119 పాఠశాలలకు బోధన అందించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయన్నారు. త్వరలో అన్ని పాఠశాలలకు కనెక్ట్ అయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించిన 42 మంది అనుభవజ్ఞులైన టీచర్లు వర్చువల్ విధానం ద్వారా బోధన అందించేందుకు ముందుకు వచ్చారన్నారు. డిసెంబర్ 7వ తేదీన మెగా పేరెంట్స్ మీటింగ్‌ను పండుగలా జరపాలన్నారు. కార్యక్రమంలో కర్నూల్ డిప్యూటీ డిఇఒ హనుమంతరావు, కార్యాలయం ఏడి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

పూలే ఆశయ సాధనకు కృషి

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా
- జిల్లా వ్యాప్తంగా పూలే వర్ధంతి కార్యక్రమాలు



పూలే విగ్రహానికి నివాళ్లులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా పూలే విగ్రహానికి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కర్నూలు నగరంలోని బిర్లా గేటు సమీపంలో ఉన్న పూలే కాంస్య విగ్రహానికి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా పూల మాలలు వేసే నివాళులు అర్పించారు. జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మితో పాటు బీసీ కుల ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో : నగరంలోని కాంగ్రెస్ జిల్లా కమిటీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి డిసిసి అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, కాంగ్రెస్ పార్టీ సిటీ అధ్యక్షులు జిలాని బాషా, నాయకులు దామోదరం రాధాకృష్ణ, బజారన్న, బతుకన్న తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ వర్సిటీలో.. రాయలసీమ వర్సిటీలో పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఎన్‌టికె నాయక్, రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడులు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ నరసింహులు, ఎగ్జామినేషన్స్ డీన్ సుందరానందపుచ్చా, రీసెర్చ్ డైరెక్టర్ విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో : ఎస్‌ఎఫ్‌ఐ కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో శ్రీ మేధా జూనియర్ కళాశాలలో రాజ్యాంగ ఆవిర్భావ వజ్రోత్సవాలలో భాగంగా పూలే, అంబేద్కర్ వర్ధంతుల సందర్భంగా సభ నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపల్ రాము, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నగర కార్యదర్శి సాయి, ఉదయ్‌లు పాల్గొని పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. అబ్దుల్లా, సాయి, ఉదయ్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి విద్యను అందించేందుకు పాలక ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన ఉపాధినిచ్చే విద్య కోసం ఎస్‌ఎఫ్‌ఐగా నిర్వహించే ఉద్యమాల్లో విద్యార్థులంతా భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో : ప్రజా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పూలే వర్ధంతి నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బలరాం, నాయకులు డేవిడ్, పద్మానంద యోగి, రవికుమార్, నరసింహాలు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కాంగ్రెస్ కార్యాలయంలో నివాళ్లులర్పిస్తున్న నాయకులు

పూలే చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సాగునీటి సంఘాల ఎన్నికలకు
సర్వం సిద్ధం

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం ఇరిగేషన్ స్పెషల్ సిఎస్ సాయిప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికలకు డిసెంబర్ 5వ తేదిన నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. 8వ తేదిన ప్రాదేశిక నియోజకవర్గం వాటర్ యూజర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు ఉంటాయన్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 11వ తేదీన ఎన్నికలు, ప్రాజెక్ట్స్ కమిటీలకు 14వ తేదీన ఎన్నికలు ఉంటాయని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు అధికారుల నియామకం పూర్తి చేశామన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, జలవనరుల శాఖ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి, డిఈలు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాష ఆదేశించారు. గురువారం ఇంటర్మీడియట్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపుపై ప్రభుత్వ, ఎయిడెడ్ ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో త్రైమాసిక పరీక్షల్లో 37 శాతం ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్ పాస్ కావడం వల్ల వారి జీవితాలు మలుపు తిరిగే అవకాశం ఉంటుందన్నారు. స్టడీ అవర్లు ఏర్పాటు చేసి, షెడ్యూల్ రూపొందించుకుని అన్ని సబ్జెక్టులూ బోధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నందవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 84 శాతం ఉత్తీర్ణత సాధించినప్పుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎమ్మిగనూరు, ఓర్వకల్లు, బి.క్యాంప్ కర్నూలు, మంత్రాలయంలో తక్కువ శాతం ఉత్తీర్ణత సాధించడం ఏమిటని సంబంధిత మండలాల ప్రిన్సిపల్స్‌ను ప్రశ్నించారు. కళాశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? ఎంతమంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు? ఏ సబ్జెక్టులో ఎక్కువ మంది ఫెయిల్ అయ్యారు? అన్న విషయాలపై విశ్లేషణ చేశారా? రానున్న అర్ధ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత ఏ విధంగా పెంచాలనే అంశంపై యాక్షన్ ప్లాన్ రూపొందించుకున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 17 నుంచి అర్ధ వార్షిక పరీక్షల ఫలితాల్లో పురోగతి కచ్చితంగా కనపడాలన్నారు. జెసి డాక్టర్ బి.నవ్య, డిస్ట్రిక్ట్ ఒకేషనల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పరమేశ్వర రెడ్డి, ఆర్‌ఐఒ గురువయ్య శెట్టి పాల్గొన్నారు.

శిక్షణను రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - మద్దికెర

ఉపాధ్యాయులకు సాల్ట్ పథకం కింద నిర్వహిస్తున్న లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎన్ రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలను రద్దు చేయాలని యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎంజి.నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడారు. రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నా ప్రభుత్వం అలాగే సాగించడం శోచనీయమని తెలిపారు. ఈనెల 28న శిక్షణకు హాజరై తూర్పుగోదావరి జిల్లాలో ఒక ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుకు గురై మృతి చెందడం బాధాకరమని చెప్పారు. శిక్షణ కార్యక్రమాలను రెసిడెన్షియల్ విధానంలో కాకుండా నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని కోరారు. నాయకులు ఎం.రంగన్న, ఎం.విశ్వనాథ్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

'మహిళలకు మార్గదర్శి పూలే'

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మహాత్మ జ్యోతిరావు పూలే మహిళలకు మార్గ దర్శకులని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పట్నం రాజేశ్వరి తెలిపారు. గురువారం పూలే సర్కిల్ వద్ద పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడానికి వచ్చిన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నగరంలోని పూలే సర్కిల్‌లో పూలే వర్ధంతిని అధికారికంగా నిర్వహించడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని తెలిపారు. నక్కలమిట్ట శ్రీనివాసులు, శేషఫణి, నంది విజయలక్ష్మి, కొమ్ముపాలెం శ్రీనివాసులు, రాంబాబు, పాలెం రాధ, హుస్సేన్ బీ, దేవీబాయి, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

సామాజిక దార్శనికుడు పూలే

- జూనియర్ సివిల్ జడ్జి భారతి

ప్రజాశక్తి - పత్తికొండ

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎంఎస్.భారతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రంగస్వామి తెలిపారు. గురువారం పూలే వర్ధంతి సందర్భంగా పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఉన్న బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేష్, ఉపాధ్యక్షులు రవి కుమార్, కోశాధికారి రాజశేఖర్, సహాయ కార్యదర్శి వాసు, సీనియర్ న్యాయవాదులు సురేష్ కుమార్, మైరాముడు, సత్యనారాయణ, తిమ్మయ్య చౌదరి, ఈరన్న, మల్లికార్జున, నాగేష్, న్యాయవాదులు సురేంద్ర కుమార్, రమేష్ బాబు, కృష్ణయ్య, బాలబాష, నారాయణస్వామి, ప్రసాద్ బాబు, జటంగి రాజు, దామోదరాచారి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురు శేఖర్ తెలిపారు. గురువారం రజక వృత్తిదారుల సంఘం కర్నూలు న్యూసిటీ కమిటీ ఆధ్వర్యంలో వీరనారి ఐలమ్మ కార్యాలయంలో పూలే వర్ధంతిని అధ్యక్షులు రాముడు అధ్యక్షతన జరిగింది. సి.గురుశేఖర్ మాట్లాడుతూ... పూలే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని, ఆయన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు. న్యూ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు సి.రాముడు, సి.శేషాద్రి, ఓల్డ్ సిటీ కార్యదర్శి సిహెచ్.శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు మద్దిలేటి, ఎల్లయ్య, కర్రన్న, వీరేష్, నెట్టికంటయ్య, చందు, చంద్రన్న, పకీరప్ప పాల్గొన్నారు. **కర్నూలు (హాస్పిటల్)** నగరంలోని నంద్యాల చెక్ పోస్ట్ వద్ద దామోదర సంజీవయ్య భవనంలో పూలే వర్ధంతి నిర్వహించారు. నంద్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎఐసిసి సభ్యులు జెంగిటి లక్ష్మీనరసింహ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పాణ్యం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలస్వామి, రమణ, షేక్షావలీ, జాకీర్, ఉస్సేన్, అబిబ్ పఠాన్ ఖాన్, చెన్నయ్య, మధు పాల్గొన్నారు. **బెళగల్** హైస్కూల్‌లో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసిపి నాయకులు, బెళగల్ సర్పంచి పాండురంగన్న, టిజి.వెంకటేష్, సిబి.గోవిందా రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు హరూన్, మద్దిలేటి, ఉప సర్పంచి ఇబ్రహీం పాల్గొన్నారు.

కర్నూలు క్రైమ్ : జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు విద్యార్థులు కృషి చేయాలని ఈ.తాండ్రపాడు సర్పంచి బాలపీరా కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ వజ్రోత్సవాల కార్యక్రమం, పూలే వర్ధంతి సందర్భంగా ఈ.తాండ్రపాడు గ్రామంలోని హై స్కూల్‌లో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచి బాలపీరా, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్, మండల కన్వీనర్ అంజి మాట్లాడారు. పూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో అందరికీ సమాన విద్య కోసం ఉద్యమించాలని కోరారు. విద్య ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా, విలువలతో కూడిన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఎస్‌ఎఫ్‌ఐ పని చేస్తోందని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు శివ, సూరి పాల్గొన్నారు.

పత్తికొండలో నివాళులర్పిస్తున్న భారతి

నివాళులర్పిస్తున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు



నివాళులర్పిస్తున్న నాయకులు

నివాళులర్పిస్తున్న నాయకులు

నివాళులర్పిస్తున్న నాయకులు

పూలే ఆశయాలను సాధిద్దాం

- టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

సంఘసంస్కర్త, సామాజికవేత్త మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను సాధిద్దామని టిడిపి కర్నూలు పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్ తెలిపారు. పూలే వర్ధంతి సందర్భంగా గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆకెపోగు ప్రభాకర్, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు బీసీ సెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ టిడిపి బీసీ నాయకులతో కలిసి జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకెపోగు ప్రభాకర్ మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు సమానత్వం కల్పించేందుకు పూలే పోరాటం చేశారని చెప్పారు. నేటి యువత పూలే ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని కోరారు. బీసీ నాయకులు నాగరాజు యాదవ్, జె.తిరుపాల్ బాబు, విజయ్ కుమార్, కె.మహేష్ గౌడ్, బేతం కృష్ణుడు, వెంకటరాముడు, రామకృష్ణ, సోమిశెట్టి నవీన్, దరూర్ జేమ్స్, మైనార్టీ నాయకులు షేక్షావలీ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు గ్రామంలోని గొర్రెల కాపరి శ్రీనివాసులుకు చెందిన 30 గొర్రెలు బుధవారం రాత్రి కుక్కల దాడిలో మృతి చెందాయి. ఆయనకి రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెల సహకార సంఘం అధ్యక్షులు కె.శ్రీనివాసులు గురువారం బాధితులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి కూడా ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బాధితులను పరామర్శించిన వారిలో కర్నూలు జిల్లా కురువ సంఘం ఉపాధ్యక్షులు పెద్దపాడు ధనుంజయ, కురువ వెంకటరాముడు, తిరుమలేష్, మద్దిలేటి పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న నాయకులు

సిసి రోడ్లతో మారిన రూపురేఖలు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

సిసి రోడ్ల ఏర్పాటుతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోడుమూరు మండలంలో 14 పంచాయతీలు ఉండగా మరో ఐదు మజరా గ్రామాలు మొత్తంగా 19 గ్రామాలు ఉన్నాయి. చాలా గ్రామాల్లో సిసి రోడ్లు లేకపోవడం వల్ల వర్షాకాలంలో బురదమయంగా, గుంతలమయంగా మారేవి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 'పల్లెపండగ' పేరుతో 34 సిసి రోడ్లకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే 12 రోడ్లను అధికారుల చొరవతో పూర్తి చేశారు. మరో 22 రోడ్లను ఈనెల చివరి నాటికి పూర్తి చేస్తామని అధికారులు, నాయకులు పేర్కొంటున్నారు. సిసి రోడ్లు వేయడం హర్షనీయమని, మురుగుకాలువలు కూడా నిర్మిస్తే మరింత బాగుంటుందని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

ఈనెల చివరి నాటికి సిసి రోడ్లు పూర్తి

- పిఆర్ ఎఇ గంగరాజు

మండలానికి మొత్తంగా 34 సిసి రోడ్లు మంజూరయ్యాయి. ఇప్పటికే 12 పూర్తి చేశాం. మిగిలినవి ఈనెల చివరి నాటికి పూర్తి చేస్తాం.

మా కాలనీలో రోడ్డు వేయడం ఆనందంగా ఉంది

- దుబ్బన్న వెంకటగిరి గ్రామవాసి

మా కాలనీ ఏర్పడి ఇప్పటికి 40 ఏళ్లయింది. మేము 15 సంవత్సరాలుగా రోడ్లు వేయాలని విన్నవిస్తున్నాం. రోడ్డు వేయలేదు. ఇప్పుడు మా కాలనీలో రోడ్డు వేయడం ఆనందంగా ఉంది.

చీడపీడల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

అవగాహన కల్పిస్తున్న అధికారులు

పంటల్లో చీడపీడల నియంత్రణకు భారత వ్యవసాయ శాఖ వారితో ఒక మొబైల్ యాప్‌ను రూపొందించింది. సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ విజయవాడ నుంచి కె.వీరయ్య చౌదరి, సురేష్ కాంబ్లీ అనే ఇద్దరు చీడపీడల నియంత్రణ అధికారులు గురువారం కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లా నుంచి వచ్చిన 20 మంది రైతులు, 14 మంది స్కౌట్స్, జిల్లా వనరుల కేంద్ర సిబ్బందికి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని సెమినార్ హాలులో జాతీయ చీడపీడల పర్యవేక్షణ వ్యవస్థ రూపొందించిన మొబైల్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులు నేరుగా వారి ఆండ్రాయిడ్ లేదా ఐఫోన్ ద్వారా పంటలకు ఆశించిన చీడపీడల ఫొటోలు తీసి ఎన్‌పిఎస్‌ఎస్ మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే ఆ చీడపీడలను గుర్తించడమే కాకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలను సైతం సూచిస్తుంది. కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృతి సమాచారం అందించగానే.. ఉధృతికి తగ్గట్టుగా చీడపీడల నివారణ చర్యలను ఈ యాప్ సిఫారసు చేస్తుంది. జిల్లా వ్యవసాయ అధికారిని పిఎల్.వరలక్ష్మి, జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు అన్నపూర్ణ, సాంకేతిక అధికారి ఎస్.అల్లీ పీరా పాల్గొన్నారు.

భూముల రీసర్వేపై సబ్ కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి - మంత్రాలయం

ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్

మండలంలో జరిగిన భూ సర్వేపై సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆరా తీశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.రవి ఆధ్వర్యంలో వీఆర్ఒలు, గ్రామ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీ సర్వే వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు గ్రామసభల ద్వారా వచ్చిన వినతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రీ సర్వే నివేదికలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం భూ సంబంధిత సమస్యలపై కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్న మాధవరం గ్రామానికి చెందిన నరసింహ సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ తహశీల్దార్ గురురాజ రావు, మండల సర్వేయర్ అశోక్, వీఆర్ఒలు భీమనగౌడ్, భీమయ్య, ఆనంద, నరసప్ప, శ్వేత పాల్గొన్నారు.

పాఠశాలల్లో డిప్యూటీ డిఇఒ తనిఖీలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

మండలంలోని పలు పాఠశాలలను ఆదోని డిప్యూటీ డిఇఒ వెంకటరమణా రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట గ్నోబిల్ జీనియస్ ప్రయివేట్ పాఠశాల సందర్శించారు. పెట్రోల్ బంకు వైపు కట్టించిన అడ్డు గోడ ఉన్న ప్రవేశాన్ని మూసివేయాలని ఆదేశించారు. పాఠశాల భద్రత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. అనంతరం గోనెగండ్ల, కులుమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు ఎపి మోడల్ స్కూల్‌ను సందర్శించారు. పదో తరగతి పాఠాలను బోధించే ఉపాధ్యాయులతో చర్చించారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. అపార్ ఐడి జనరేషన్ ప్రతి విద్యార్థికి రావాలన్నారు. ఎంఇఒలు మాధవస్వామి, నీలకంఠ పాల్గొన్నారు.

సుధాకర్ రావు సేవలు హర్షణీయం

- ఎల్ఐసి బ్రాంచి మేనేజర్ పులి నాయక్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సుధాకర్ రావుకు సన్మానం చేస్తున్న సిబ్బంది

ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుధాకర్ రావు సేవలు హర్షణీయమని ఎల్ఐసి బ్రాంచి మేనేజర్ పులి నాయక్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సంతోష్ కుమార్, కడప డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.తిమ్మారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మహేష్ కుమార్, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ ఉరుకుందయ్య శెట్టి పేర్కొన్నారు. గురువారం ఎల్ఐసి కార్యాలయంలో సుధాకర్ రావు విరమణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఎందరో ఏజెంట్లను తీర్చిదిద్దారన్నారు. ఎల్ఐసి ఉద్యోగులు ఇందిరా, వాణి, ప్రతాప్, రఘునాథ్ గౌడ్, వెంకటేశ్వర్లు, గోవర్ధన్, మురళీకృష్ణ, అంపయ్య, రాము, బ్రహ్మానంద రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, సురేష్, వీరారెడ్డి, వినయ్ కుమార్, మల్లికార్జున, వెంకటేష్, ఎల్ఐసి ఏజెంట్లు రంగస్వామి, నరసింహులు, సూర్యకాంతరెడ్డి, అబ్దుల్ గఫూర్, దేవేంద్ర మూర్తి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

- కోతకు గురైన రోడ్డు

ప్రజాశక్తి - దేవనకొండ

కరివేముల సమీపంలో కోతకు గురైన రోడ్డు

మండలంలోని కరివేముల గ్రామ సమీపాన కర్నూలు -బళ్లారి రహదారి మధ్యలో హంద్రీనీవా కాలువ నీటికి రోడ్డు కోతకు గురై పెద్ద గొయ్యి ఏర్పడింది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అన్న భయాందోళనలో ఉన్నామని ప్రయాణికులు, వాహన చోదకులు వాపోతున్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆదమరిస్తే ప్రమాదమే సంభవించే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రోడ్ల మరమ్మతులను పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు. సంబంధిత ఆర్అండ్‌బి శాఖాధికారులు కరివేముల గ్రామ సమీపంలో రోడ్డు మధ్యలో ఏర్పడిన పెద్ద గొయ్యిని పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పూలే జీవితం ఆదర్శం

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం నేటి యువతకు ఆదర్శమని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కెవిపిఎస్ కార్యాలయంలో పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కెవిపిఎస్ నాయకులు తిమ్మప్ప, చిన్నప్ప, అరుణ్, సుమాల ఆంథోని, సుమాల రాజు, మనోహర్ పాల్గొన్నారు. **గోనెగండ్లలో** ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో రాజ్యాంగ ఆవిర్భావ వక్తృత్వపోటీల్లో భాగంగా పూలే వర్ధంతి నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు పవన్, రంగస్వామి, యుటిఎఫ్ జిల్లా మాజీ నాయకులు నరసింహ మాట్లాడుతూ... విద్యావేత్త, సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు విద్యార్థులు కృషి చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రియాజ్, పవన్, ఓంకార్, శ్రీను పాల్గొన్నారు. **కొతాకోటలో** ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎంఆర్‌పిఎస్ మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, మండల కోశాధికారి దేవన్న, పట్టణ అధ్యక్షులు ఎస్.ఆనంద్, ఉపాధ్యక్షులు ఉలిగయ, అధికార ప్రతినిధి శివకుమార్, నాయకులు కిరణ్, చిన్న పాల్గొన్నారు.

గోనెగండ్లలో నివాళులర్పిస్తున్న నాయకులు

కొతాకోటలో...

పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఇంటి నిర్మాణ పనులు వేగవంతం

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శివప్ప నగర్ హౌసింగ్ లే అవుట్‌ను సందర్శించారు. ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే గ్రీన్ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం నిమిత్తం కాలనీ వాసులతో చర్చించారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

తుంగభద్ర తీరంలో మొసలి కలకలం

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర నదీతీరంలో మొసలి కలకలం లేపింది. మండలంలోని గుడికంబాలి గ్రామ సమీపంలో గురువారం తుంగభద్ర నది ఒడ్డున పెద్ద మొసలి పొలాల వైపు రావడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఏడాదిలో తుంగభద్ర నదీతీరంలోని అనేక గ్రామాల పంట పొలాల్లో మొసళ్లు కంటబడుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని నదిచాగి, కుమ్మలనూరు, మురళి గ్రామాల సమీపంలో గత రెండు నెలల నుంచి మొసళ్లు సంచరిస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం వరి పంటను కోస్తున్న తరుణంలో రైతులు భయం భయంగా నదీతీరంలో వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. మొసళ్ల నుంచి ప్రజలకు ఏ ప్రమాదమూ జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్లానింగ్ సెక్రటరీల బదిలీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థలో పని చేస్తూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఆదర్శనగర్ ప్లానింగ్ సెక్రటరీలను అడిషనల్ టౌన్ ప్లానింగ్ అనంతపురం వారు బదిలీ చేసినట్లు ఉత్తర్వులు విడుదల చేశారు. వి.దివ్య, ఎస్.రూపను నందికొట్కూరు, యు.నవీన్ కుమార్‌ను ఆత్మకూరు, ఎం.రంగనాథ్‌ను బేతంచర్ల, షణ్ముఖను గూడూరుకు, బిఎండి.రఫీక్‌ను ఆదోనికి బదిలీ చేసినట్లు పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ గురువారం తెలిపారు.

ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించండి

- ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - నందవరం

నందవరం ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇఒఆర్‌డి సందీప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప మాట్లాడారు. ఎస్సీ కాలనీలో దాదాపు 300 కుటుంబాలు నివసిస్తున్నాయని, వారికి కేవలం మూడు కుళాయిలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. అవి కూడా 3, 4 రోజులకోసారి నీరు రావడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆ నీళ్లు కూడా కొద్ది సమయం మాత్రమే వాడడంతో ప్రజలు ఒక రోజంతా నీళ్ల కోసమే ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. తాగడానికి డబ్బులు పెట్టి కొనాల్సిన దుర్భర పరిస్థితి నెలకొందన్నారు. పంచాయతీ, మండల పరిషత్ అధికారులకు సమాచారం ఇచ్చినా తాగునీరు విడుదల చేయలేదన్నారు. కుళాయిల ద్వారా వచ్చే నీరు ఉప్పు నీరు కావడంతో వాటాయంది అనారోగ్యానికి గురవుతున్నారని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తక్షణమే తాగునీరు విడుదల చేయాలని కోరారు. లేకపోతే ప్రజలను కలుపుకొని రోడ్డుపైకొచ్చి నిరసన చేపడతామని హెచ్చరించారు. నాయకులు రత్నం, అబ్దుల్ పాల్గొన్నారు.

'క్షయ' మొబైల్ ఎక్స్‌రే క్యాంపు


మొబైల్ ఎక్స్‌రే క్యాంపు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో క్షయ వ్యాధి నిర్ధారణ మొబైల్ ఎక్స్‌రే క్యాంపును ప్రాథమిక ఆరోగ్య సూపర్‌వైజర్ రంగస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. క్షయ వ్యాధి సూపర్‌వైజర్ వీరన్న, జీవితం గ్రామంలో 142 మంది అనుమానిత రోగులకు మొబైల్ వాహనం ద్వారా ఉచితంగా ఎక్స్ రే పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం వస్తూ ఉండడం, దగ్గుతోపాటు గళ్ల, గళ్లలో రక్తం పడడం, ఆయాసం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, చెమటలు పట్టడం లాంటి లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.92 కోట్లు

- మేనేజర్ వెంకటేష్ జోషి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం రూ.3.92 కోట్లు వచ్చిందని శ్రీమఠం మేనేజర్ వెంకటేష్ జోషి తెలిపారు. గురువారం మఠంలో ఆయన మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కానుకల రూపంలో వేసిన ఆదాయాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, శ్రీమఠం అధికారుల సమక్షంలో సేవాదారులతో కలిసి లెక్కించినట్లు తెలిపారు. 31 రోజుల హుండీ ఆదాయం నగదు రూపంలో రూ.3,92,58,940 రూా, బంగారం 174.500 గ్రాములు, వెండి 1270 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

రాజ్యాంగ అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలి

- ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ

ప్రజాశక్తి - మంత్రాలయం

దేశ పరిపాలన సౌలభ్యం కోసం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆధ్వర్యంలో రచించిన రాజ్యాంగ అమలుకు కూడా కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి, నిరసన చేపట్టారు. ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ ఎస్.రవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో కలిసి రాజ్యాంగం అమలు కమిటీ ఏర్పాటుతో దేశంలోని దళితుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. నాయకులు ఏబు, మండల నాయకులు ప్రభుదాసు, మాణిక్య రాజు, దేవదాను, కుమార్, అబ్రహం పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న నాయకులు

ఒక్క బస్సు కూడా తేలేదు

- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

- ఆర్‌టిసి బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత ప్రభుత్వం ఎమ్మిగనూరు ఆర్‌టిసి డిపోకు ఒక బస్సు కాదు.. ఒక టైరు కూడా తీసుకొచ్చిన పాపాన పోలేదని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా 6 నెలల్లోనే మూడు సార్లు 12 ఆర్‌టిసి బస్సులను తీసుకొచ్చామని తెలిపారు. గురువారం ఎమ్మిగనూరు ఆర్‌టిసి డిపోలో ఎమ్మిగనూరు-నెల్లూరు (2), తిరుపతి (1), కర్నూలు- గూడూరు (1) 4 కొత్త బస్సులను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం త్వరలోనే ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆర్‌టిసి బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. డిపో మేనేజర్ అమర్‌నాథ్, టిడిపి నాయకులు, కోఆపరేటివ్ స్టోర్ ఛైర్మన్ గట్టు అల్తాఫ్, మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్, రామకృష్ణ, నవాజ్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

టిడిపిలోకి వైసిపి నాయకులు

ఎమ్మిగనూరు రూరల్ : మండలంలోని పార్లపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ఆయన సోదరుడు, సర్పంచి సత్యనారాయణ రెడ్డి, వారి అనుచరులు దాదాపు 500 మంది ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. గురువారం వీరికి ఎమ్మెల్యే టిడిపి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్లపల్లి, గువ్వలదొడ్డి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి గ్రామంలో కూటమి ప్రభుత్వ జెండా ఎగురవేయాలని కోరారు. టిడిపి నాయకులు భీమ రాయుడు, నరేష్, తాజుద్దీన్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీవీ

కార్యకర్తల సంక్షేమమే ప్రధాన అజెండా

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు తుగ్గలి నాగేంద్ర

ప్రజాశక్తి - తుగ్గలి

కార్యకర్తల సంక్షేమమే టిడిపి ప్రధాన అజెండా అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక శాఖ సభ్యులు తుగ్గలి నాగేంద్ర తెలిపారు. గురువారం పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు ఆదేశాల మేరకు టిడిపి నాయకుల ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదును నాగేంద్ర ప్రారంభించారు. సర్పంచి రవి, మాజీ సర్పంచి రామాంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్ బాలు, సీనియర్ మేట్ అరవ భీమయ్య, అల్లా బకాష్, హయ్యద్ బాషా పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బాధితులకు న్యాయం చేయాలి

- ముస్లిం జెఎసి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సంబల్ పట్టణంలో మసీదు సర్వే సందర్భంగా పోలీసు కాల్పుల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని ముస్లిం జెఎసి నాయకులు కోరారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం జెఎసి నాయకులు, ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్, ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షులు జావెద్, ఎస్‌డిపిఐ ఆదోని అధ్యక్షులు గౌస్ ఖాన్ మాట్లాడారు. మసీదు సర్వే సందర్భంగా చోటు చేసుకున్న ఘటనలో ఐదుగురు ముస్లిం యువకులు మృతి చెందారని తెలిపారు. కాల్పుల్లో మృతి చెందిన యువకుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విచక్షణ రహితంగా కాల్పులకు పాల్పడిన పోలీసులపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. 1991 ప్రార్థన స్థలాల చట్టం కింద 1947కు పూర్వం ఉన్న గుడి, మసీదుల జోలికి వెళ్లరాదని కింది కోర్టులను ఆదేశించాలని సుప్రీంకోర్టును కూడా ఈ వినతి ద్వారా కోరుతున్నామని తెలిపారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైషమ్యాలను, తన మిత్రుల దోపిడీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి మతతత్వాలను బిజెపి ఒక ఆయుధంగా వాడుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. కుల, మతాలకతీతంగా రాజ్యాంగ హితవు పలికారు. రాబోయే రోజుల్లో ఆదోనిలో ముస్లిం, మైనారిటీ, అన్ని వర్గాల ప్రజల సమస్యలపై పోరాటానికి ముస్లిం జెఎసి ముందుకెళ్లనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం జిల్లా మాజీ అధ్యక్షులు నూర్ మహ్మద్, మానవ హక్కుల సంఘం నాయకులు జకీయా, సమస్యల కర్తలు సద్దాం హుస్సేన్, ఖాదర్ బాషా ఉన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లిం జెఎసి నాయకులు

తాలూకా స్థాయిలో కోర్టులతో

న్యాయవ్యవస్థపై నమ్మకం పెంచాలి

- బార్ అసోసియేషన్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

తాలూకా స్థాయిలో కోర్టులను పెంచి న్యాయ వ్యవస్థపై నమ్మకం పెంచాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఆర్.గురురాజారావు, రఘురాం పేర్కొన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... గ్రామస్థాయిలో న్యాయ కోర్టులను ఏర్పాటు చేస్తే వాటి ద్వారా ఉపయోగం లేకపోగా న్యాయవ్యవస్థపై ప్రజలు గౌరవం కోల్పోతారని తెలిపారు. ఇంకా కొన్ని కోర్టులను ఏర్పాటు చేస్తే న్యాయం సత్వరంగా అందుతుందని చెప్పారు. మరికొన్ని న్యాయ స్థానాలను నియోజకవర్గ స్థాయిలోనే ఏర్పాటు చేయాలని కోరారు. బార్ అసోసియేషన్ నాయకులు ఆనంద్, నాగరాజు, బాష, కుమార్, రంగనాథ్, నాగన్న, హనుమంతు, దస్తగిరి, ఇర్ఫాన్, జయచంద్ర పాల్గొన్నారు.

కొలుకోలేక రైతు మృతి

ప్రజాశక్తి - హొళగుంద

చికిత్స పొందుతూ కోలుకోలేక రైతు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి... రైతు ఈరన్న విరుపన్న (49) బుధవారం పొలంలో ట్రాక్టర్‌తో పని చేసుకుంటుండగా విద్యుఘాతానికి గురై పొలంలో కుప్పకూలిపోయారు. పక్కనే పొలంలో ఉన్న రైతులు గమనించి వివరున్నను ప్రథమ చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం రెఫర్ చేశారు. రైతును బళ్లారికి తీసుకెళ్లారు. గురువారం కోలుకోలేక మృతి చెందారు. విరుపన్న భార్య ఈడిగ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మిరామ్ నాయక్ తెలిపారు.

వేసవిలోనే శిక్షణ తరగతులు

- ఎస్‌టియు జిల్లా కార్యదర్శి గోపాల్

ప్రజాశక్తి - ఆదోని

బడి వేళల్లో కాకుండా వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని ఎస్‌టియు జిల్లా కార్యదర్శి గోపాల్ తెలిపారు. గురువారం ఆదోనిలో ఎస్‌టియు భవన్‌లో ఆదోని, కౌతాళం మండల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు (ఎస్ఎల్ఐపి) పాఠశాల నాయకత్వం అభివృద్ధి కార్యక్రమం (ఎఫ్ఎల్ఎన్) ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ పేరుతో రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు నిర్వహిస్తుండడం ఉపాధ్యాయులు పాలిట శాపంగా మారిందని విమర్శించారు. ఇటీవల కృష్ణా జిల్లా అగిరిపల్లిలో జరిగిన శిక్షణ తరగతుల్లో ఒక ఉపాధ్యాయుడు మృతి చెందారని తెలిపారు. ప్రస్తుతం విజయనగరం జిల్లా గజపతినగరంలో శ్రీనివాసరావు అనే ఉపాధ్యాయుడు శిక్షణ సమయంలోనే మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ మృతితోనైనా ప్రభుత్వం మేల్కొని శిక్షణ తరగతులను వేసవి సెలవుల్లోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎస్‌టియు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.సుంకన్న మాట్లాడుతూ... శిక్షణ తరగతులను డివిజన్ కేంద్రాల్లో కానీ, జిల్లా కేంద్రాల్లో కానీ నాన్ రెసిడెన్షియల్ విధానంలో వేసవిలోనే జరపాలని కోరారు. మృతి చెందిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సీనియర్ నాయకులు అంజనయ్య, జి.రాము, ఎస్.సుధాకర్, పి.మౌలాలి సొహెల్, బి.మారయ్య, జి.మహానంది, ఎస్.రాజేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

పూలే సేవలు మరువలేనివి

- ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - హొళగుంద

మహాత్మ జ్యోతిరావు పూలే సేవలు దేశానికి ఆదర్శమని, ఆయన చేసిన సేవలు మరువలేనివని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. గురువారం పూలే వర్ధంతి సందర్భంగా మండలంలోని ఎల్లార్తి గ్రామంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయ్యప్ప స్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేసి, అయ్యప్ప స్వాములతో కాసేపు ముచ్చటించారు. నాయకులు గిరి, దర్గప్ప, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

సాయిబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

- బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

తుంగభద్ర దిగువ కాలువ ఆయకట్టు రైతుల సమస్యల పరిష్కారానికి పాటుపడే టిడిపి సీనియర్ నాయకులు, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు సాయిబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు కోరారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దశాబ్ద కాలంగా ఎల్ఎల్‌సి నీటి వాటా కోసం వివిధ రూపాల్లో ఆందోళన చేశారన్నారు. మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని ఉప్పరహాల్ గ్రామ నాయకులు రాజకీయ ప్రస్థానం సాగించినా పార్టీ ఆదర్శాల నుంచి టిడిపిలోనే కొనసాగుతూ రైతు సమస్యల పరిష్కారం కోసం దీర్ఘకాలికంగా పోరాడారని తెలిపారు. ఇంతవరకు రాజకీయంగా ఎలాంటి గుర్తింపు రాలేదని పేర్కొన్నారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తే రైతులకు మరింత మేలు చేకూరే దిశగా కృషి చేస్తారని తెలిపారు.

పూలే వర్ధంతి : మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా గౌరవాధ్యక్షులు పి.సాయిబాబా, డివిజన్ ఛైర్ ప్రెసిడెంట్ ధనాపురం శేషప్ప, పట్టణ అధ్యక్షులు డాక్టర్ వీరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ యు.సోమశేఖర్, పట్టణ గౌరవ సలహాదారులు జి.నర్సారెడ్డి, పట్టణ జనరల్ సెక్రటరీ బి.మల్లికార్జున, పట్టణ గౌరవ సలహాదారులు బెస్త ప్రకాష్, పట్టణ జాయింట్ సెక్రటరీ బి.చిన్న ఈరప్ప, జాయింట్ సెక్రటరీ వడ్డెర కిరణ్, లక్ష్మీనారాయణ, ఈసీ మెంబర్లు బి.లక్ష్మీనారాయణ, జి.నరసింహులు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

బాబును కలిసిన సోమిశెట్టి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు రాష్ట్ర సచివాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా అభివృద్ధికి, కుడా అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని కోరారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి నవీన్ ఉన్నారు.

బాబును కలిసిన అరుణమ్మ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, మంత్రి లోకేష్‌ను టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణమ్మ సచివాలయంలో కలిశారు. జిల్లా అభివృద్ధికి, మహిళల అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని ఆమె కోరారు.

సామాజిక సేవలో రోటరీ క్లబ్

- రోటరీ సభ్యులు

ప్రజాశక్తి - ఆదోని

సామాజిక సేవలో రోటరీ క్లబ్ ముందుంటుందని సభ్యులు తెలిపారు. గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత గుండె, డయాబెటిస్ వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని రోటరీ క్లబ్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ సైఫుల్లా తెలిపారు. ఆర్‌టిసి డిపోలో ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య పరీక్షల్లో పట్టణంలోని సీనియర్ ఫిజీషియన్లు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ బాలాజీ, డాక్టర్ అనిలాష్, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ గోవిందరాజులు, డాక్టర్ శాలి జమీల్, డాక్టర్ కౌషిక్ గుప్తా సోమిశెట్టి, డాక్టర్ సైఫుల్లా పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు. సామాజిక సేవలో భాగంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన వైద్య శిబిరంలో 157 మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు, హిమోగ్లోబిన్, క్రియాటిన్, కొలెస్ట్రాల్, యూరిక్ యాసిడ్, కంటి పరీక్షలు, దంత వైద్య పరీక్షలు, థైరాయిడ్, షుగర్, ఈసీజీ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఉద్యోగంలో భాగంగా ఆర్‌టిసి డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతుంటారని తెలిపారు. ప్రమాదాల బారిన పడి మృతి చెందిన సంఘటనలు గుర్తించి ఆర్‌టిసి కార్మికుల కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అంతకుముందు ఆదోని ఆర్‌టిసి ఇన్‌ఛార్జ్ డిపో మేనేజర్ అమర్‌నాథ్, అసిస్టెంట్ ఇంజినీర్ వేణుగోపాల్, కార్మిక సంఘం నాయకులు హాజిబాబు శిబిరాన్ని సందర్శించారు. రోటరీ క్లబ్ సభ్యులు ప్రశాంత్ గాంధీ, సునీల్ రెడ్డి, జీవన్ రెడ్డి, భరత్ షా, రాజేష్ జైన్, ఇతేష్, వికాస్ జైన్, హుస్సేన్ బాష పాల్గొన్నారు.


డాక్టర్ శ్రీనివాసులును సన్మానిస్తున్న సభ్యులు

NAME CHANGE

I, BADAI MAHEBOOB KHAN (Old Name) H.No:24-94 Havanapet , Adoni, kurnool dist, AP., I have changed my name as BADAI MAHAMMMED Basha (New Name) S/o B.Basheer Ahamed.